ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్‌ రామలింగం

బోడుప్పల్‌: అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు పరిశుభ్రతను పాటిద్దామని బోడుప్పల్‌ కమిషనర్‌ రామలింగం సూచించారు. బోడుప్పల్‌ నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులచే అంటువ్యాధులపై నిర్వహించిన అవగాహన కళాజాత కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్‌ ఆదేశాల మేరకు వార్డుల్లో కళాజాత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డ్రై డే ప్రై డేను తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పాటించి, అంటువ్యాధులను తరిమికొట్టాలన్నారు. వాతావరణంలో సంభవించిన మార్పులతో వచ్చే అంటువ్యాధుల పట్ల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మేనేజర్‌ ఆర్‌వీ. నాగేంద్ర బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నారాయణరెడ్డి, కమలాకర్‌, వినోద్‌, కళాజాత టీమ్‌ లీడర్‌ అర్జున్‌రావు, డప్పు బాబు తదితరులు పాల్గొన్నారు.

మండప నిర్వాహకులతో డీసీపీ సమావేశం


మాట్లాడుతున్న మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఏసీపీ తదితరులు

ఉప్పల్‌ : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అపశ్రుతులు జరుగకుండా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి డీసీపీ పద్మజ సూచించారు. బాగ్యనగర్‌ గణేష్‌ ఉత్సవ సమితి ఉప్పల్‌ సర్కిల్‌, రాచకొండ పోలీసుల సంయుక్తాధ్వర్యంలో ఉప్పల్‌లో మల్కాజిగిరి ఏసీపీ ఎస్‌. చక్రపాణితో కలిసి మండప నిర్వాహకులకు సలహాలు ఇచ్చారు. ప్రతీ మండప నిర్వాహకులు విధిగా మండపానికి ముగ్గురు చొప్పున వాలింటీర్లను ఏర్పాటు చేసుకోవాలని, అనుకోని సంఘటనలు చోటు చేసుకున్నా.. వెంటనే స్పందించే టీమ్‌లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. గాలి, వర్షానికి మండపాలు దెబ్బతినకుండా ఉండేలా నిర్మించుకోవాలన్నారు. మండపాల్లో ఫైర్‌ సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు సూచనల మేరకే సౌండ్‌ సిస్టమ్స్‌ను అమర్చుకోవాలని చెప్పారు. బడులు, ఆసుపత్రుల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్లు ఎలక్షన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజువర్మ, ఉప్పల్‌ సర్కిల్‌ భాగ్యనగర్‌ గణేష్‌ ఉత్సవ సమితి ప్రతినిధులు రేవల్లి రాజు, రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌, ఉప్పల్‌ గణేష్‌ ఉత్సవ సమితి ఫౌండర్‌ ఆకుల మహేందర్‌, జెట్ట కిషోర్‌, నిరంజన్‌చారీ, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై హైడ్రా కమిషనర్‌ ఆగ్రహం

- మల్కాజిగిరి సర్కిల్‌ మిర్జాల్‌గూడలో పర్యటించిన రంగనాథ్‌
- రోడ్డు ఆక్రమణలు, నాలా ఇరువైపుల చేపట్టిన నిర్మాణాల పరిశీలన
- నోటీసులు ఇచ్చి త్వరలో కూల్చివేస్తామని హెచ్చరిక


మిర్జాల్‌గూడలో పర్యటిస్తున్న హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌


కుచించుకుపోయిన నాలా ఇలా..

గౌతంనగర్‌: రోడ్ల ఆక్రమణలు, నాలా ఇరువైపుల నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌ అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

66 నుంచి 11 ఫీట్లకు కుదింపు..

ఇటీవల మిర్జాల్‌గూడ చిన్మయ్‌ మార్గ్‌ అసోషియేషన్‌ ప్రతినిధులు హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌ను కలిసి తమ కాలనీలో హుడా లేఅవుట్‌లో 66 ఫీట్ల రోడ్డు 15 ఫీట్లకు కుచించుకుపోయి వర్షం వచ్చిన ప్రతిసారి ఇళ్లలోకి వరదనీరు చేరుతోందని కమిషనర్‌కు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన మల్కాజిగిరి సర్కిల్‌ గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని మిర్జాల్‌గూడ చిన్మయ్‌మార్గ్‌తో పాటు రోడ్లను ఆక్రమించి చేపట్టిన 5 నిర్మాణాలను ఆయనే స్వయంగా పరిశీలించారు.

మీరే కూల్చివేసుకోండి..

సదరు నిర్మాణదారులను స్వయంగా మీరే కూల్చివేసుకోవాలని లేదంటే నోటీసులు జారీచేసి బుల్డోజర్ల సహకారంతో హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేతలు ప్రారంభిస్తామని కమిషనర్‌ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తే సహించేది లేదన్నారు.


ఇళ్లలో చేరిన వర్షపు నీరు

- మల్కాజిగిరి సర్కిల్‌-28 అధికారులకు, పట్టణ ప్రణాళిక అధికారులకు ఆయన పలు సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు.
- న్యాయస్థానం స్టేటస్‌ కో 6 నెలలు మాత్రమే ఉంటుందని ఏళ్లు గడుస్తున్నా.. అధికారులు ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. ఆక్రమణలను ప్రోత్సహిస్తే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. అలాగే నాలాలకు ఇరువైపుల నిర్మించుకున్న అక్రమ నిర్మాణాలను నోటీసులు ఇచ్చి కూల్చివేతలు చేపడతామని తెలిపారు. హైడ్రా అధికారులతో పాటు మిర్జాల్‌గూడ అసోసియేషన్‌ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు పెరుమళ్‌, సంయుక్త కార్యదర్శి బాలు, అఖిల్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


పూజల్లో సినీ సంగీత దర్శకురాలు ఎంఎం.శ్రీలేఖ

అల్వాల్‌: కానాజిగూడలోని మరకత శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ సంగీత దర్శకురాలు ఎంఎం. శ్రీలేఖ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు మోత్కూరు సత్యనారాయణశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్‌ అడ్మిషన్లు

ఘట్‌కేసర్‌: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల్‌ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏలో హెచ్‌ఈపీ, హెచ్‌ఈపీఏ, ఈఐఆర్‌పీ, ఈపీజీ, ఈపీజే, ఈపీఎస్‌, హెచ్‌పీఎస్‌, హెచ్‌పీవైఎస్‌, ఈపీపీ గ్రూపులలో ఈ నెల 5, 6 తేదీల్లో స్పాట్‌ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ రాధిక తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులై దోస్త్‌లో రిజిస్ట్రేషన్‌ చేసుకున్న విద్యార్థులు అర్హులన్నారు. అంకుషాపూర్‌ ప్రిన్సిపాల్‌ ఇంజినీరింగ్‌ కళాశాల ప్రాంగణంలోని ఇబ్రహీంపట్నం మహిళా డిగ్రీ కళాశాలకు ఒరిజినల్‌ సర్టిఫికెట్లు, రెండు జిరాక్స్‌ సెట్లు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం ఫోన్‌: 94418 68332లో సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార దినోత్సవం



మల్కాజిగిరి: ఓల్డ్‌ మల్కాజిగిరి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు ఏఏ ఆహార పదార్థాలు తీసుకుంటే పోషకాలు సమకూరుతాయో వివరించి, అనంతరం వారికి గుడ్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్‌ ఆశాలత, ఏఎన్‌ఎం చంద్రకళ, ఆశావర్కర్లు చంద్రకళ, హేమలత, అర్చన, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ పర్యటన


సీఫెల్‌ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌

మల్కాజిగిరి: ప్రజలు వర్షాలతో ఇబ్బంది పడకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌ సూచించారు. ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ సీఫెల్‌కాలనీలో కార్పొరేటర్‌ పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పేరుకుపోయిన మట్టి, మురుగును శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. కాలనీలో రోడ్డు సమస్య ఉందని, పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్‌, మేనేజర్‌ నవీన్‌కుమార్‌, వీఐ రజనీకాంత్‌, బాబు, కిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.

అభినందన



విద్యార్థినులను అభినందించిన హెచ్‌ఎం రాధిక

కుషాయిగూడ: శ్రీ సరస్వతీ శిశుమందిర్‌ పాఠశాల విద్యార్థినులు క్షేత్రస్థాయి (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, కర్ణాటక) పోటీలకు ఎంపికయ్యారు. ఆగస్టు31, ఈనెల 1,2 తేదీల్లో మంచిర్యాల జిల్లా రాంపూర్‌లోని విద్యాపీఠంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని క్షేత్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రాధిక తెలిపారు. వారిలో ట్రిపుల్‌జంప్‌లో పూజిత ప్రథమస్థానం, డిస్క్‌త్రోలో నిఖిత, హైజంప్‌లో మనస్విని ద్వితీయ స్థానాల్లో విజయం సాధించినట్లు వివరించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థినులను ఘనంగా సత్కరించి అభినందించారు.

మట్టి గణపతుల పంపిణీ


మట్టి గణపతులను పంపిణీ చేసిన కార్పొరేటర్‌ శ్రవణ్‌

మల్కాజిగిరి: వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని మల్కాజిగిరి కార్పొరేటర్‌ శ్రవణ్‌ పిలుపునిచ్చారు. బుధవారం శివపురికాలనీలోని ఆయన కార్యాలయంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. ప్రతి ఏటా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మట్టిగణపతులను పంపిణీ చేస్తున్నామన్నారు. సెప్టెంబర్‌ 17న తెలంగాణ విమోచన దినోత్సవంగా పాటించాలని ప్రతి ఇంటి మీద జాతీయజెండా ఎగురవేయాలన్న లక్ష్యంతో జాతీయజెండాలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంబాబు, శ్రీకాంత్‌, శివానంద్‌, వేణుయాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించండి


కలెక్టర్‌ గౌతమ్‌తో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్‌ ప్రభుదాస్‌

కుషాయిగూడ: ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి మీర్‌పేట్‌-హెచ్‌బీకాలనీ డివిజన్‌ కార్పొరేటర్‌ జె. ప్రభుదాస్‌ బుధవారం కలెక్టర్‌ గౌతమ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌ పరిధిలోని ఓల్డ్‌ మీర్‌పేట్‌లోని కమ్యూనిటీహాల్‌కు చెందిన 450 గజాల స్థలంతో పాటుగా కై లాసగిరిలోని కమ్యూనిటీహాల్‌కు చెందిన స్థలాన్ని కొంతమంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిని అడ్డుకుని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని కలెక్టర్‌ను కోరారు. కమ్యూనిటీహాల్‌ స్థలాల్లో నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు కార్పొరేటర్‌ పేర్కొన్నారు.

నూతన భవనాలు కట్టించాలని వినతి..

మౌలాలి : మౌలాలిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్‌, కలిసి ఒకే భవనంలో ఉండటంతో ఇబ్బందిగా ఉందని, ప్రభుత్వ స్థలాల్లో తెలుగుమీడియానికి ప్రత్యేక భవనాన్ని నిర్మించాలని కలెక్టర్‌ను మౌలాలి కార్పొరేటర్‌ సునీతాశేఖర్‌యాదవ్‌ కోరారు. ఓల్డ్‌ సఫిల్‌గూడ దగ్గర ఉన్న ప్రాథమిక పాఠశాల కూడా కేవలం 250 గజాల్లో ఉందని, మౌలాలిలో ఉన్న ప్రభుత్వ స్థలంలో నూతన భవనాలు కట్టించి ఇవ్వాలని కార్పొరేటర్‌ కలెక్టర్‌ గౌతమ్‌కి వినతిపత్రం అందజేశారు.

నియోజకవర్గ సమస్యలపై..

అల్వాల్‌: మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అల్వాల్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం, ఫైర్‌ స్టేషన్‌ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని, లైబ్రరీ, కొకూర్‌ తెట్లకుంట చెరువు కబ్జాకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి

కాప్రా: కృపా విల్లాస్‌ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం కాలనీలో నెలకొన్న సమస్యలపై స్థానికులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. వాటర్‌వర్క్స్‌ అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్‌ నేతలు భైరి నవీన్‌గౌడ్‌, సంతోష్‌, బద్రయ్య, బసవరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన


పరిశీలిస్తున్న జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌, డీసీ శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్‌: వినాయక చవితిని పురస్కరించుకుని అల్వాల్‌ సర్కిల్‌ పరిధిలోని కొత్త చెరువులో నిమజ్జన ఏర్పాట్లను బుధవారం జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌, అల్వాల్‌ సర్కిల్‌ డీసీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్‌ కమిషనర్‌ మాట్లాడుతూ.. వినాయక మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం తుర్కపల్లిలో పర్యటించి వరదనీరు నిలిచిపోకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. అల్వాల్‌ సర్కిల్‌ ఎస్‌ఈ చిన్నారెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌ ఆస్పత్రుల పర్యవేక్షణపై ఓరియంటేషన్‌

సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేట్‌ హెల్త్‌కేర్‌ నిపుణులు పూర్తి సమాచారంతో చట్టపరమైన నియంత్రణ ప్రమాణాలకు కట్టుబడి ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికా గుప్తా (లోకల్‌ బాడీస్‌) తెలిపారు. బుధవారం నీలిమ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌లో ప్రైవేట్‌ ఆస్పత్రుల డయాగ్నోస్టిక్‌ సెంటర్‌, మేనేజింగ్‌, మెడికల్‌ డైరెక్టర్లు, గైనకాలజిస్ట్‌, రేడియాలజిస్టులు, పాథాలజిస్టులకు పర్యవేక్షణపై ఓరియంటేషన్‌ నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

కుషాయిగూడ: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా కాప్రా మండలం, కుషాయిగూడ జడ్పీహెచ్‌ఎస్‌, జీహెచ్‌ఎం జి.బాపురెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. విధుల పట్ల అంకితభావంతో పనిచేసి మెరుగైన విద్యాబోధన, ఫలితాలు సాధించినందుకు ఆయన ఆ అవార్డుకు ఎంపికయ్యారు. నేడు జరగబోయే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బాపురెడ్డి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందుకోనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

అల్వాల్‌: అల్వాల్‌ లయోలా అకాడమీలో వ్యవసాయ విభాగం అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్‌ ఎస్‌.మరియదాస్‌ తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ అధ్యాపకుల జాబితాలో ఎంపికయ్యారు. మరియదాస్‌ గత 29 ఏళ్లుగా లయోలా అకాడమీలో సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన ఉత్తమ అధ్యాపకులుగా ఎంపిక కావడంపై లయోలా అకాడమీ అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూచనలు ఇస్తున్న వైద్య సిబ్బంది

కాప్రా: ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం పోషణమాసం కార్యక్రమం నిర్వహిస్తోందని జమ్మిగడ్డలోని కుషాయిగూడ పీహెచ్‌సీ వైద్య అధికారి డాక్టర్‌ రమాదేవి తెలిపారు. బుధవారం ఆస్పత్రిలో పోషణమాసం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డాక్టర్‌ రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చైల్డ్‌ వెల్ఫేర్‌ అధికారి కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పిల్లల్లో పౌష్టికాహారలోపాన్ని నివారించేందుకు మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ చూపేందుకు ప్రభుత్వం పోషణమాసాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 30 వరకు కొనసాగుతుందన్నారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులు, కిశోర బాలికలు పౌష్టికాహారం లోపం వల్లే అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పుట్టిన బిడ్డలకు తల్లిపాల ప్రాముఖ్యతను మహిళలకు వివరించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికి బాలామృతం ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తారని వివరించారు. వైద్య సిబ్బంది డాక్టర్‌ మాధురి, డాక్టర్‌ మధులిక, స్వాతి, శైలజ, గీత, పార్వతి, కీర్తి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సమాజసేవలో ముందజ


ఫౌండేషన్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న స్కూల్‌ సిబ్బంది, ఉపాధ్యాయులు

గౌతంనగర్‌: చదువుతో పాటు సేవలో కూడా ఆదర్శంగా నిలుస్తామని గౌతంనగర్‌ సెయింట్‌ మార్టిన్స్‌ హైస్కూల్‌ విద్యార్థులు చెబుతున్నారు. ఇట్రాడ్‌ సోచ్‌ ఫౌండేషన్‌ వారు చేపట్టిన ఓల్డేజ్‌ హోమ్‌ ఫర్‌ బ్లైండ్‌ ప్రాజెక్ట్‌ కోసం గౌతంనగర్‌లోని మల్కాజిగిరి సెయింట్‌ మార్టిన్స్‌ హైస్కూల్‌ యాజమాన్యాన్ని సాయం కోరారు. ఈ సందర్భంగా బుధవారం స్కూల్‌ విద్యార్థినివిద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌ కలిసి రూ.1,50,000 నగదును సేకరించి ఫౌండేషన్‌కు అందజేశారు. స్కూల్‌ అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఫౌండేషన్‌ ఫౌండర్‌ మధుకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల సమస్య పరిష్కారానికి చర్యలు



మల్కాజిగిరి: బండచెరువు దిగువ కాలనీలో ముంపు సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌ అన్నారు. బుధవారం అనంతసరస్వతీనగర్‌ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న ముంపు సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ముంపు సమస్య పరిష్కారానికి బాక్స్‌ డ్రైన్‌ (నాలా) అలైన్‌మెంట్‌ ప్రకారం నిర్మించకుండా రాజకీయ నేతల ఒత్తిళ్లతో మార్చారని దీంతో సమస్య పరిష్కారం కాలేదన్నారు. డీసీ రాజు, అధికారులు పాల్గొన్నారు.

ఈశ్వరీ పీఠం ప్రథమ వార్షిక బ్రహోత్సవాలు


ప్రత్యేక పూజలు చేస్తున్న రవిచంద్రవర్మ

బోడుప్పల్‌: పెంటారెడ్డి కాలనీలోని శ్రీసాయి బాలాజీ రెసిడెన్సీలో బుధవారం ఈశ్వరీపీఠం ప్రథమ వార్షిక బ్రహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, అమ్మవారు, స్వామివారికి విశేష ఓషధ అభిషేకం, ప్రత్యేక అలంకరణ, చతుషష్టి ఉపచారపూజ, అమ్మవారికి లలిత సహస్రనామాలతో 54 కిలోల కుంకుమతో లక్ష కుంకుమార్చన, మహా నివేదన, మహా మంగళ నీరాజనం, మధ్యాహ్నం 2గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకులు అయాచితం రవిచంద్రశర్మ మాట్లాడుతూ.. ప్రకృతి శాంతించి, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశామన్నారు.

పండుగ శాంతియుతంగా నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి

రామంతాపూర్‌ : వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా అధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. బుధవారం గణేష్‌నగర్‌లో భాగ్యనగర్‌ గణేష్‌ ఉత్సవ సమితి రామంతాపూర్‌ విభాగం అధ్యక్షుడు ఆర్‌.వీ శేఖర్‌ ఆధ్వర్యంలో జరిగిన గణేష్‌ మండపాల నిర్వాహకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మండపాల వద్ద అధ్యాత్మిక వాతావరణం కల్పించి నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించాలన్నారు. శాంతి భద్రతల విషయంలో పోలీసు విభాగానికి సహకరించాలని ఆయన కోరారు. రామంతాపూర్‌ భాగ్యనగర్‌ ఉత్సవ సమితి ఫౌండర్‌ తిండేరు హనుమంతరావు, కార్పొరేటర్లు చేతన హరీష్‌, శ్రీవాణి వెంకట్‌రావు, ఉప్పల్‌ సీఐ ఎలక్షన్‌రెడ్డి, ట్రాఫిక్‌ సీఐ మాధవి, జీహెచ్‌ఎంసీ ఏఈ సాయికిరణ్‌, మండపాల నిర్వాహకులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

వర్షానికి జలమయమైన రహదారులు


వంపుగూడ సమీపంలో వరద నీటిని తొలగిస్తున్న అధికారులు

కాప్రా: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీల్లో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. కాప్రా డివిజన్‌ వంపుగూడలో వర్షపునీరు నిలిచి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు బుధవారం కాలనీలో నిలిచిన నీటిని తరలించే చర్యలు చేపట్టారు. నిలిచిన వర్షపు నీటిని జేసీబీతో కాలువ చేసి దిగువకు మళ్లించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657